ఏ'మందు'రో నాయనా...!

కూటమి ప్రభుత్వం వచ్చాక నగరంలో మద్యం ఏరులై పారుతోంది. మందుబాబులు మద్యంలో మునిగి తేలుతున్నారు. రోడ్ల పక్కన, బురదలో దొర్లుతూ, అడ్డంగా పడుకుంటూ దర్శనమిస్తున్న మందుబాబులను చూస్తుంటే, విశాఖ తీరానికి కొత్త తరహా 'మద్యపాన పర్యాటకం' మొదలైందా అనిపిస్తోంది. ఒకప్పుడు బీచ్‌లలో అలుపుసొలుపు లేకుండా ఆడుకునే పిల్లలు, ప్రస్తుతం రోడ్ల పక్కన పడి ఉన్న 'పెద్ద పిల్లల'ను చూసి షాకవుతున్నారు. 'అదేంటి అంకుల్, పడుకున్నారు?'అని అమాయకంగా అడిగితే, 'అదేరా నాయనా.. భూదేవి ఒడిలో సేద తీరుతున్నాం'అని తూలుతూ సమాధానం చెబుతున్నారట కొందరు. కూటమి ప్రభుత్వం వచ్చాక బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. మందుబాబులు మాత్రం తమ డ్యాన్స్ పెర్ఫార్మెన్స్‌లను, బురద స్నానాలను రోడ్లపైనే ప్రదర్శిస్తున్నారు. ఇకపై విశాఖ టూరిజం ప్రమోషన్లలో 'మా తీరం అందంగా ఉంటుంది, కానీ మా రోడ్లపై పడున్న మందుబాబులను చూస్తే ఇంకా అందంగా ఉంటుంది' అని ప్రచారం చేసుకున్నా ఆశ్చర్యపోనవసరం లేదు. నియోజకవర్గంలో ఈ వింత దృశ్యాలు విశాఖవాసులకు కొత్త వినోదాన్ని పంచుతున్నాయనేది మాత్రం నిజం.

– డాబాగార్డెన్స్



చుక్కేసి..కునుకేసి...సూర్యబాగ్ వద్ద..



మకరాసనం : ఈతపేట జెండాచెట్టు వద్ద మత్తులో...



గమ్మత్తుగా..పూర్ణామార్కెట్ వద్ద



కొబ్బరితోట రోడ్డుపై జబర్దస్త్‌గా..



ఏమి హాయిలే అలా..రైల్వే న్యూకాలనీ రోడ్డుపై

క్లుప్తంగా

మేయర్‌ను కలిసిన జీవీఎంసీ కమిషనర్



నగరాభివృద్ధిపై మేయర్‌తో చర్చిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన కేతన్ గార్గ్ మంగళవారం నగర మేయర్ పీలా శ్రీనివాస్‌ను జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా వారిరువురూ జీవీఎంసీ కార్యకలాపాలు, పరిపాలనాపరమైన అంశాలు, విశాఖ నగరాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. విశాఖ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని కమిషనర్ తెలిపారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, నగర పరిశుభ్రత, రోడ్ల అభివృద్ధి, విద్యుత్ దీపాల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక కార్యాచరణ చేపడతానని ఆయన పేర్కొన్నారు.

మర్యాదపూర్వక భేటీ



కమిషనర్‌ను కలిసిన యూనియన్ నాయకులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ నూతన కమిషనర్‌గా నియమితులైన కేతన్ గార్గ్‌ను మంగళవారం జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు మహదేవ్ ఆనందరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఈశ్వరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సతీష్, ప్రధాన కార్యదర్శి రెల్లి సత్యం, డిప్యూటీ కార్యదర్శి కె.దుర్గాప్రసాద్, కోశాధికారి జి.సాగర్‌మూర్తి, సహాయ కార్యదర్శి వి.జీవన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సీహెచ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన సమాచార శాఖ డీడీ



కలెక్టర్ హరేంధిర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సదారావు

మహారాణిపేట: సమాచార పౌర సంబంధాల శాఖ విశాఖ కార్యాలయ ఉప సంచాలకులుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కె. సదారావు మంగళవారం కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, జర్నలిస్టుల సంక్షేమం కోసం తీసుకుంటున్న చర్యలు, అక్రిడిటేషన్ల వ్యవహారాలు, ఇతర అంశాల్లో అనుసరించాల్సిన విధానాలపై సదారావుకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. సమన్వయంతో వ్యవహరించాలని, స్నేహపూర్వక వాతావరణంలో పని చేసుకోవాలని సూచించారు.

ప్రేమసమాజం నూతన అధ్యక్షుడికి సత్కారం



హనుమంతరావును సత్కరిస్తున్న సంస్థ సభ్యులు

డాబాగార్డెన్స్: ప్రేమసమాజం కమిటీ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన ప్రముఖ సంఘ సేవకుడు మట్టుపల్లి హనుమంతరావును మంగళవారం స్వామి వివేకానంద సంస్థ కార్యదర్శి ఉమాదేవి, ముఖ్య సభ్యులు పి.ఈశ్వరరావు, కనకమహాలక్ష్మి, పోలితల్లి సత్కరించారు. ప్రేమసమాజం నూతన అధ్యక్షుడిగా హనుమంతరావు ఎన్నిక కావడం సంతోషకరమని ఉమాదేవి అన్నారు. తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ, ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హనుమంతరావు స్వామి వివేకానంద ఆశ్రమానికి కూడా పలు సందర్భాల్లో ఎన్నో సేవలు అందిస్తున్నారని ఆమె కొనియాడారు.

జగన్‌ను కలిసిన రవీంద్ర



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో రవీంద్ర భరత్

డాబాగార్డెన్స్: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆ పార్టీ విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం తాడేపల్లి కేంద్ర కార్యలయంలో జగన్‌మోహన్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు.

వైఎస్సార్‌సీపీ 33వ వార్డు అధ్యక్షుడిగా రమేష్

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడుగా ముత్తాబత్తుల రమేష్‌ను నియమిస్తూ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

29న విశాఖ అభివృద్ధి-నిధులు-సంస్కరణలపై సదస్సు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

డాబాగార్డెన్స్: అభివృద్ధి, నిధులు, సంస్కరణలపై ఈ నెల 29న డాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సు పోస్టర్‌ను అల్లూరి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ ఇన్‌చార్జ్ జీఎస్ రాజేశ్వరరావు, కమిటీ సభ్యులు బుజ్జి, సీహెచ్ సత్యనారాయణ, టి.కామేశ్వరరావులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ, ఈ సదస్సులో పలువురు ప్రముఖులు ప్రసంగించనున్నారని తెలిపారు. వారిలో సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ సైన్సెస్ విశ్రాంత ఆచార్యుడు ప్రొఫెసర్ సి.రామచంద్రయ్య, విజయవాడ ఎంబీవీకే చైర్మన్ పి.మధు, ఏపీ పట్టణ పౌర సమైక్య సీహెచ్ బాబూరావు, జీవీఎంసీ సీపీఐ ఫ్లోర్ లీడర్ ఏజే స్టాలిన్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ కార్యదర్శి ఎం.వేంకటేశ్వర్లు, జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు, వార్డు ప్రతినిధి ప్రకాశరావు, నివాస్ ప్రతినిధి పి.నారాయణమూర్తి ఉన్నారు. రాజేశ్వరరావు మాట్లాడుతూ, రాష్ట్రంలో అతిపెద్ద నగరమైన విశాఖ.. రాష్ట్ర విభజన తర్వాత గత పదేళ్లలో ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న ఐటీ పరిశ్రమలు తరలిపోయే పరిస్థితి ఏర్పడిందని, మెట్రో రైల్ వంటివి కేవలం ప్రకటనలకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. విశాఖకు వెన్నెముక వంటి స్టీల్‌ప్లాంట్‌ను సైతం అమ్మకానికి పెడుతున్నారని ఆయన విమర్శించారు. గత దశాబ్ద కాలంలో రాష్ట్ర ఖజానా నుంచి జీవీఎంసీకి ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోగా, జీవీఎంసీ పన్నుల ఆదాయం రూ.350 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం వాడుకుందని రాజేశ్వరరావు తెలిపారు. వృత్తి పన్ను ద్వారా జీవీఎంసీకి ఏడాదికి వచ్చే రూ.60 కోట్ల ఆదాయం రాష్ట్ర బడ్జెట్‌లోకి తరలిపోవడం వల్ల నిధులు లేక జీవీఎంసీ అప్పుల ఊబిలోకి కూరుకుపోతుందని చెప్పారు. దీనికి తోడు ప్రజలపై భారాలు మోపుతూ ఆస్తి విలువ ఆధారిత పన్నులు తీసుకొచ్చారని, తాగునీరు, మురుగునీరు వంటి వాటిని కూడా ప్రైవేట్‌పరం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆయన అన్నారు. ఈ సదస్సు ఉదయం 10 గంటల నుంచి జరుగుతుందని, నగర పౌరులు పెద్ద ఎత్తున పాల్గొని విశాఖ అభివృద్ధిపై చర్చలో పాలుపంచుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

జూలై 9న అఖిల భారత సమ్మె విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

డాబాగార్డెన్స్: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా జూలై 9న తలపెట్టిన అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని నగరంలోని అఖిల పక్ష కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు మంగళవారం జగదాంబ జంక్షన్‌లోని సీఐటీయూ కార్యాలయంలో సమ్మె విజయవంతం కావాలని కోరుతూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులకు నష్టం కలిగించే విధానాలను అమలు చేస్తోందని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతోందని విమర్శించారు. ఇందులో భాగంగానే 29 కార్మిక చట్టాలను మార్చి, కార్మికులకు తీవ్ర నష్టం కలిగించే విధంగా నాలుగు లేబర్ కోడ్స్‌ను తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఈ లేబర్ కోడ్స్ అమలయితే కార్మికులు సమ్మె చేసే హక్కు, సంఘం పెట్టుకునే హక్కు, జీతభత్యాలు బేరం ఆడుకునే ప్రాథమిక హక్కులను కోల్పోతారని హెచ్చరించారు. కార్మికులకు నెలకు కనీసం రూ.26 వేలు వేతనం చెల్లించాలని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. తొలగించిన 4 వేల మంది ఉక్కు కాంట్రాక్ట్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ఎల్ఐసీ, బ్యాంకులు, పోర్టులు, చమురు సంస్థలు, రక్షణ రంగం, అంతరిక్షం, గనులు వంటి ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను ఆపాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులైన ఆటో, ముఠా, బిల్డింగ్, తోపుడు బళ్లు, మోటార్ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్‌తో కూడిన సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు.

ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం, వీఓఏ, ఆర్పీ, స్కూల్ శానిటేషన్ వర్కర్స్ వంటి వివిధ ప్రభుత్వ పథకాల్లో పనిచేస్తున్న వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని, స్థానికులకు 75 శాతం ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా జూన్ 25 నుంచి 30 వరకు కార్మికుల పని ప్రదేశాలు, నివాస ప్రాంతాల వద్ద కరపత్రాల పంపిణీ చేయనున్నారు. జూలై 1 నుంచి 4 వరకు అన్ని పరిశ్రమల వద్ద గేట్ సమావేశాలు నిర్వహిస్తారు. జూలై 5న జీవీఎంసీ నుంచి పలు ప్రాంతాల్లో బైక్ ర్యాలీ, జూలై 7న పారిశ్రామిక ప్రాంతంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తారు. జూలై 9న దొండపర్తి రైల్వే డీఆర్ఎం కార్యాలయం నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు భారీ కార్మిక ప్రదర్శన జరపాలని సమావేశంలో నిర్ణయించారు.సమ్మె రోజున యావత్ కార్మిక వర్గం, ఆటో, ఇతర మోటార్ కార్మికులు తమ వాహనాలను నిలిపివేసి బంద్‌కు మద్దతు తెలపాలని నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మధరావు, ఐఎన్‌టీయూసీ జిల్లా కార్యదర్శి ఈశ్వరరావు, సీఎఫ్‌టీయూఐ అఖిల భారత అధ్యక్షుడు ఎస్.కనకారావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.వేంకటేశ్వర్లు సహా పలువురు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా రాచపోలమాంబ ఉత్సవాల ప్రారంభం



సతకం పట్టు వద్ద రాచపోలమాంబ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అమ్మవారి ఉత్సవంలో భాగంగా సాముగరిడీ కళాకారుల సందడి

అల్లిపురం: భక్తుల కొంగు బంగారం, అల్లిపురం వాసుల ఆరాధ్య దైవం శ్రీ రాచపోలమాంబ అమ్మవారి వార్షిక ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భూలోకమాత అమ్మవారి పండగను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెయిన్‌రోడ్డులోని సతకం పట్టు వద్ద భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం కుమ్మరవీధిలో గల అమ్మవారి పుట్టింటి నుంచి అమ్మవారి ప్రతిమలను ఊరేగింపుగా తీసుకువచ్చారు. సాము గరిడీలు, పులివేషాలు, సంప్రదాయ డప్పు వాయిద్యాలతో కూడిన తిరువీధి ఉత్సవం కుమ్మరవీధి, అల్లిపురం మెయిన్‌రోడ్డు, మార్కెట్‌రోడ్డు, నేరెళ్లకోనేరు జంక్షన్ మీదుగా చెరువుగట్టున ఉన్న శ్రీ రాచపోలమాంబ అమ్మవారి ఆలయంలో వెలసిన భూలోకమాత దేవాలయం వరకు సాగింది. అక్కడ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోలీస్ ఔట్‌పోస్టులతో నేర నియంత్రణ

వెస్ట్ సబ్‌డివిజన్ ఏసీపీ పృథ్వీతేజ



రైల్వేస్టేషన్ జ్ఞానాపురం ఔట్‌గేట్ వద్ద పోలీస్ ఔట్‌పోస్టును ప్రారంభిస్తున్న ఏసీపీ పృథ్వీతేజ



ఔట్‌పోస్టు ప్రారంభించి, స్థానికులు, సిబ్బందితో మాట్లాడుతున్న ఏసీపీ

తాటిచెట్లపాలెం: నేర నియంత్రణకు పోలీస్ ఔట్‌పోస్టులు ఎంతగానో ఉపయోగపడతాయని వెస్ట్ జోన్ సబ్ డివిజన్ ఏసీపీ పృథ్వీతేజ తెలిపారు. జ్ఞానాపురం రైల్వేస్టేషన్ ఔట్ గేట్ సమీపంలో కంచరపాలెం పోలీసులు ఏర్పాటు చేసిన పోలీస్ ఔట్‌పోస్టును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ రైల్వేస్టేషన్ పరిసరాల్లో నేరాలు నియంత్రించేందుకు పోలీస్ ఔట్ పోస్టు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇక్కడ షిఫ్టుల ప్రకారం రోజూ 9 మంది సిబ్బంది అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. సమీప ప్రాంతాల్లో ఫిర్యాదులపై తక్షణ స్పందన ఉంటుందన్నారు. కార్యక్రమంలో కంచరపాలెం పోలీస్‌స్టేషన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ సమీర్, రవికుమార్, దివ్యభారతి తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన శ్రీ కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం వైభవంగా 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ ప్రత్యేక పూజా కార్యక్రమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శోభారాణి, సహాయ కార్యనిర్వహణాధికారి తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది హాజరయ్యారు.

ఘనంగా మరిడిమాంబ జాతర



అమ్మవారిని దర్శించుకున్న స్వర్ణకార సంఘ నాయకులు

డాబాగార్డెన్స్: నగరంలోని 38వ వార్డు కంచరవీధిలో వేంచేసియున్న మరిడిమాంబ వార్షిక జాతర మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం, స్వర్ణకార సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ పక్కి కొండబాబు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అప్పలబత్తుల శ్రీకాంత్, పండూరి శేఖర్, గురజాడ కనకరాజు, వీరమల్ల సన్యాసిరావు, దార్ల పరమేశ్వరరావు, శివకోటి శశిభూషణ్, వరద ఈశ్వరరావు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక రోగికి చికిత్స



యువతిని మానసిక వైద్య శాలలో చేర్పిస్తున్న కేర్ టేకర్

అల్లిపురం: మానసిక సమస్యలతో బాధపడుతున్న హిమోతి అనే పశ్చిమ బెంగాల్‌కు చెందిన యువతిని మంగళవారం ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చేర్పినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. పది రోజుల క్రితం ఆరిలోవ పోలీసులు ఆదర్శనగర్‌లో హిమోతిని రెస్క్యూ చేసి, ఏయూటీడీ జీవీఎంసీ టి.ఎస్.ఆర్ కాంప్లెక్స్ మహిళల వసతి గృహానికి తరలించారు. ఆమె మానసిక పరిస్థితి సరిగా లేకపోవడంతో పాటు, మందులు వాడిస్తున్నప్పటికీ షెల్టర్‌లో తరచూ గొడవ చేస్తుండటంతో, మంగళవారం ఏయూటీడీ సంస్థ కేర్ టేకర్స్ లీలావతి, ప్రభాకర్‌లతో కలిసి ఆమెను ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చేర్పించారు. హిమోతి ఆరోగ్యం కుదుటపడిన తర్వాత ఆమె కుటుంబ సభ్యుల వివరాలు ఆరా తీసి, వారికి అప్పగిస్తామని ప్రగడ వాసు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ స్కూల్ పక్కాగా అమలు చేయాలి



తనిఖీలు నిర్వహిస్తున్న మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కేవీ రామలక్ష్మి

మురళీనగర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీ-స్కూల్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ కే.వీ. రామలక్ష్మి స్పష్టం చేశారు. మంగళవారం ఆమె విశాఖ అర్బన్ పరిధిలోని మర్రిపాలెం సెక్టార్‌లో ఉన్న పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన రామలక్ష్మి, అంగన్‌వాడీల పనితీరుపై చిన్నారుల తల్లిదండ్రులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీలలోని రికార్డులను తనిఖీ చేశారు. కేంద్రంలో చిన్నారుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో మరుగుదొడ్లు లేవని గుర్తించిన ఆమె, త్వరితగతిన వాటిని నిర్మించేలా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. తనిఖీల్లో ఆమె వెంట ఐసీడీఎస్ మర్రిపాలెం సెక్టార్ సూపర్ వైజర్ జె.టి.ఎన్. జ్యోతి, పోషణ్ అభియాన్ జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వారాహి నవరాత్రి మహోత్సవాలు

సీతంపేట: అక్కయ్యపాలెంలోని శ్రీలలితాపీఠంలో ఈ నెల 26 నుంచి జూలై 4 వరకు వారాహి నవరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. దీనికి సంబంధించిన కర పత్రాలను పీఠంలోని వారాహిదేవి సన్నిధిలో పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ ఉదయం 4:30 గంటలకు అమ్మవారికి క్షీరాభిషేకం, సాయంత్రం 7కు సహస్రనామార్చన, చతుర్వేద స్వస్తి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. ఈ నెల 29(ఆదివారం)న వారాహి హోమం చేయనున్నట్లు వెల్లడించారు. నవరాత్రి మహోత్సవాల్లో పాల్గొనాలనుకునే భక్తులు, అమ్మవారికి చీర ధరింపదలచిన వారు, ప్రసాద వితరణలో పాల్గొనదలచిన వారు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

జీఎం దృష్టికి ఉక్కు టౌన్‌షిప్ సమస్యలు



స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మిన్ జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ గంగారావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో పెరిగిపోతున్న సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని 78వ వార్డు కార్పొరేటర్ బి. గంగారావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్టీల్‌ప్లాంట్ టౌన్ అడ్మినిస్ట్రేషన్ జనరల్ మేనేజర్ చంద్రశేఖర్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. టౌన్‌షిప్ క్లస్టర్లలో జంగిల్ కటింగ్ సక్రమంగా లేకపోవడం, కటింగ్ చేసిన వ్యర్థాలు ఎప్పటికప్పుడు తొలగించక పోవడంతో క్వార్టర్లలోకి పాములు చొరబడి కాటు వేస్తున్నాయన్నారు. రెండు రోజుల కిందట సెక్టార్-11లో నివాసం ఉంటున్న తగరంపూడి శ్రీనివాసరావు పాము కాటుకు గురై మరణించడం బాధాకరమన్నారు. చెత్త కుండీలు క్రమం తప్పుండా శుభ్రం చేయకపోవడంతో పారిశుద్ధ్యం లోపిస్తుందని వివరించారు. దోమలు, కీటకాల నిర్మూలన చేయాల్సిన మలేరియా విభాగం సేవలు నిలిచిపోయాయన్నారు. టౌన్‌షిప్‌లోని 56 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయడం లేదని.. వాటి నిర్వహణ సంస్థపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టౌన్‌షిప్‌లో హోంగార్డులను తగ్గించడం వల్ల తగిన నిఘా కొరవడిందన్నారు. టౌన్‌షిప్ నివాసుల ఆరోగ్యానికి, ప్రాణాలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుల వి.వి. రమణ పాల్గొన్నారు.

ఇంటర్ బోగస్ విద్యాసంస్థలపై చర్యలకు వినతి



ఆర్ఐవోకు వినతిపత్రం అందిస్తున్న స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ ప్రతినిధి

మద్దిలపాలెం: విశాఖ జిల్లాలో గుర్తింపు లేకుండా, అకాడమీల పేరుతో ఇంటర్మీడియట్ బోధిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న బోగస్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని స్టూడెంట్స్ యునైటెడ్ నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేటి బసవ కృష్ణమూర్తి కోరారు. ఈమేరకు పిఠాపురం కాలనీలో గల ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కార్యాలయంలో ఆర్ఐవో పిల్లి మురళీధర్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరానికి ముందు ఆకర్షణీయ ప్రకటనల ద్వారా బోగస్ విద్యాసంస్థలు విద్యార్థులను, తల్లిదండ్రులను మోసం చేస్తున్నాయని ఆరోపించారు. విద్యాసంవత్సరం పూర్తయ్యే సరికి బోర్డు తిప్పేసి, విద్యార్థులను రోడ్డున పడేట్టు చేస్తున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి బోగస్ కళాశాలపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వీటిపై నిరంతర పర్యవేక్షణ చేయాలని ఆర్ఐవో మురళీధర్‌ను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.